


# అమ్మాయిలూ జాగ్రత్త!

## నగర జీవనశైలిపై ఫోకస్‌లైట్

**కొందరికి** ఏ ఉద్యోగమూ ఉండదు. లేక ఏ చిన్న ఉద్యోగమో, మధ్యరకం ఉద్యోగమో ఉంటుంది. కానీ వాళ్ళెప్పుడూ నీటుగా ఉంటారు. పెళపెళలాడుతూ ఇస్త్రీ బట్టల మధ్య నలుగుతుంటారు. ఆ బట్టలు చాలా ఖరీదుగా ఉంటాయి. ఏమి దర్జారా నాయనా అన్నట్లుంటాయి.

వాళ్ళ పర్సుల్లో నోట్ల కట్టలు పాములు పాములుగా మెలికలు వేసుకుని ఉబ్బి ఉబ్బి కనిపిస్తుంటాయి. "వాడేమిటి వాడి జీతమెంత అంతగా మిడిసి పడుతున్నాడు" అనిపిస్తుంది మనకు. "వీడేదో ఇల్లీగల్ కార్యక్రమాలలో మునిగి ఉండవచ్చు" అనిపిస్తుంది ఇలాంటి వాళ్ళను చూసినప్పుడు.

వాడి వేషం, వాడి దర్జా, వాడి వైభోగం గమనించినప్పుడు మనకు ఈర్ష్య కలగదుగానీ "ఒరేయ్ పోలీసుల్లారా వీణ్ణి కాస్త కనిపెట్టండిరా, వీడేదో యమడేంజరుగా కనిపిస్తున్నాడు. వీడు హాజీమస్తానో, శోభారాజో కావచ్చు. దేశాన్ని పాకిస్తానుకో, ఫరిస్తానుకో అమ్మేట్లున్నాడు రోరేయ్" అని అరవాలనిపిస్తుంది.

సమాజంలో రంగ రంగ వైభోగంగా బ్రతుకుతుంటారు వీళ్ళు. పొరపాటున పై అరుపుల్ని కనక మనం అరిచామంటే అన్యాయంగా నిష్కారణంగా దారినపోయే మనల్ని పట్టుకుని జైల్లో తోయించినా తోయించేయగలరు.

"బ్రోకర్ ముండా కొడుకులు వాళ్ళతో మనకెందుకు" అంటాడు మా కొండసామి అలాంటి వాళ్ళ ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

అలాంటి బ్రోకరు ముండాకొడుకులలో ఒకడే అతగాడు......

ఆ అమ్మాయి కాలేజీలో చదువుతోంది. అందంగానే ఉంటుంది (ఆ వయస్సులో అందరు ఆడపిల్లలూ అందంగానే కనిపిస్తారు). తను చాలా తెలివైనదని ఆ పిల్ల భావన (ఆ వయసు ఆడపిల్లలంతా అలానే భ్రమలలోనే ఉంటారు). ఎప్పుడూ తెగ త్రుళ్ళుతుంటుంది. సినిమాలు తెగ చూస్తుంది. తెలుగు సాహిత్యాన్ని అంతకంటే ఎక్కువ తెగ చదువుతుంది. దానా దీనా ఓ స్కిజోఫ్రెనిక్ గీసిన అర్థం పర్థం లేని బొమ్మలా తయారయిందామె మనస్సు.

రోజూ ఆమె కాలేజీకి వెళుతుంది. సాయంత్రం బస్సెక్కి మళ్ళీ ఇంటికి తిరిగి వస్తుంది. తన ఈడు వాళ్ళతో ఆ కబురు ఈ కబురు చెప్పాక, పనులు కానిచ్చుకుని పుస్తకాలు ముందు వేసుకు కూర్చుంటుంది. ఆ పుస్తకాలలో ఆమె ఏమి చదువుతుందో, ఆమె మనస్సులో ఏమి ఆలోచనలు కదులుతున్నాయో తెలుసుకోవటానికి ఆమె తల్లితండ్రులు ఏనాడూ ప్రయత్నించలేదు. అది వాళ్ళ బాధ్యతారాహిత్యం.

తను ధరించే చీర, తను పెట్టుకునే బొట్టు, తన కంటి కాటుక, తన చెంపల నునుపు, తన పెదవుల విరుపు, ఇలాంటి వాటిని అనుక్షణం తన చుట్టుపక్కనున్న వాళ్ళు గమనిస్తున్నారని భావిస్తుందామె. ఆ మాత్రం స్వయంభావన ఆ వయస్సు వాళ్ళందరికీ ఉంటుంది. అలాగే ఆమెకీ ఉంది.

వాళ్ళ కాలేజీ వదిలే సమయానికి ఆ బయట రోడు మీద కొందరు పోకిరీ కుర్రవాళ్ళు ఎదురు చూస్తుంటారు. ఆమె తన స్నేహితురాళ్ళతో కలిసి వస్తున్నప్పుడు ఆ కుర్రవాళ్ళు ఏవో మాటలు అని కాలరులు సర్దుకుంటారు. ఈ ఆడపిల్లలు ఆ మాటలు విని కోపం తెచ్చుకుంటున్నట్లు పోజు పెట్టి ఆ వెంటనే పళ్ళన్నీ బయట పెట్టి ఒక్క గిగులు గిగులుతారు. కొద్ది దూరంలో ఆ కుర్రవాళ్ళు వీళ్ళ వెనకే నడుస్తూ తమ ధోరణిలో నవ్వుతారు. మొత్తానికి వాళ్ళ ప్రవర్తనా వీళ్ళ ప్రవర్తనా కలిపి చిత్తకార్తెలో కుక్కల చేష్టల్ని గుర్తుకు తెప్పిస్తాయి. తోక ఆడించటమూ, పృష్ఠం తిప్పటమూ, పళ్ళు బయట పెట్టి గుర్రుమనటమూ అదంతా.... ఏనాడన్నా కుర్రవాళ్ళు కనిపించకపోయినా, వెనక నడవకపోయినా వీళ్ళు ఏదో ప్లాటరీని కోల్పోయినట్లు ఫీలవుతారు. అది టీనేజి లక్షణం!

ఆమె అలాంటి లక్షణంలో ఉన్నవేళ ఓ అందమైన యువకుడు - ఆధునికంగా కనిపిస్తున్న యువకుడు - రోజూ ఆమెకు కనిపించసాగాడు.

హీరో హోండా మీద వస్తాడతను. ఆమె వేపు చూస్తూ వెళ్తాడు. మొదటలో ఆమె చాలా సాదాగా చూసింది అతని వేపు. తర్వాత కొద్దిగా ఆసక్తిగా. ఆ తర్వాత ఆబగా. అతను కనిపించని నాడు ఎందుకు రాలేదబ్బా అనుకునేది. మర్నాడు మళ్ళీ అతను కనిపించగానే ఆమె కళ్ళు మెరిసేవి. ఆ మెరుపులు అతనికి తెలిసేవి కూడా.

ఒక రోజుతను తన హీరోహోండాని ఆమె పక్కనే ఆపి లిఫ్టిస్తాను రండి అన్నాడు హీరోలా. (ఆమెకలా అనిపించాడు!)

రానన్నట్లు తలూపిందామె.

మరోరోజు - బస్సులన్నీ కిక్కిరిసి ఉన్నవేళ - ఆమె ఎక్కలేక అవస్థపడుతున్న సమయాన - అతను ఆమె పక్కనే బండి ఆపి మళ్ళీ అన్నాడు.

"లిఫ్టిస్తాను రండి."

"మీకెందుకులెండి శ్రమ.."

"శ్రమేముందిలెండి రండి!!"

అదీ ... ఆహ్వానాలు అంగీకరించటమూ అనేది అలా స్టెప్ బై స్టెప్‌గా ఒకదాని తర్వాత ఒకటి జరుగుతాయి.

"మీరెందాకా వెళ్తారు?"

చెప్పింది.

"మీ కాలనీ వద్ద దింపుతాను సరేనా?"

"అమ్మో వద్దు. ఎవరైనా చూస్తే బాగుడదు. కాస్త ఇవతల దింపేయండి!"

ఆమె ఎక్కి అతని వెనక కూర్చుంది. ఆ క్షణాన ఆమె కాళ్ళు వణికినా లోలోపల థ్రిల్‌ని ఫీలయింది.

"గట్టిగా పట్టుకోండి", అన్నాడతను కొద్ది దూరం పోయాక సడన్ బ్రేకు వేస్తూ. 'అమ్మో' అంటూ ఆమె నిజంగానే అతణ్ణి వాటేసుకుంది. వాటినే "మన్మథలీలలు" అంటారు. సినిమాల్లో చూపించేదీ, టీవీలలో కుమ్మరించేదీ ఆ రసాన్నే -

ఆ తర్వాత ఆమె చాలాసార్లు అతడి వెనుక కూర్చుని ప్రయాణించింది. ఇంటి వద్ద ఏదో వంక బెట్టి అతనితో పార్కులకు వెళ్ళింది. సూర్యా టాకీసులో మూల కూర్చుని అతనితో సినిమాలు చూసింది. శరీరాన్ని స్పృశించనిచ్చింది. మనస్సును మచ్చిక చేసుకోనిచ్చింది.

ఈ తతంగాలన్నీ జరుగుతున్న రోజుల్లో ఆమె తనకు తాను నిజమైన హీరోయిన్‌లా కనిపించింది. మిగతా ఆడపిల్లలు చవటమ్మలుగా, వాజెమ్మలుగా కనిపించారు.

లవ్ అంటే ఇదీ, జీవన మకరందమంటే ఇదీ, పిచ్చిదానిలా తల్లితండ్రులు కుదిర్చిన ఎవడితోనో తిరగటం, కాపురం చేయటం

మామూలు ఆడవాళ్ళపని, అది తనవల్ల కాదు బాబూ...

ఈ రకంగా ఆమె తన వానిటీకి మెరుగులు దిద్దుకుంటున్న సమయాన ఓ రోజు అతను (ఇప్పుడామెకు ప్రియుడు) ఎటన్నా వెళ్ళిపోదామా అన్నాడు.

అంటే ఎలోప్ -

బాప్‌రే అది మరింత థ్రిల్‌తో కూడుకున్న పని!

గుండెల్లో వణుకుడు మొదలైనా ఆ పిల్ల వప్పుకుంది.

అంతకు ముందు అతడు తనో పెద్ద వ్యాపారవేత్త కొడుకునని చెప్పుకున్నాడు. తన తండ్రి ఇప్పట్లో పెళ్ళికి వప్పుకోవటం లేదనీ ఎటన్నా తిరిగి వద్దామనీ, కొడుకో కూతురో పుట్టాక తండ్రి వప్పుకోక ఏం చేస్తాడనీ అన్నాడు.

కొడుకో కూతురో అని అతనన్నప్పుడు ఆ పిల్ల " ఛా..ఫో.." అంది సిగ్గుగా.

మరి వెళ్ళిపోదామా అని అన్నాడతను. వెళ్ళిపోదాం అందామె.

తను వీలైనన్ని డబ్బులు తీసుకుని వస్తున్నట్లూ, ఆమెను కూడా ఏమన్నా ఉంటే తెమ్మని అన్నాడతను. వీలైనంత ఎక్కువ కాలం విడిగా గడపటానికి వీలుగా...

ముహూర్తం నిశ్చయించుకున్నారు వాళ్ళు. ముందే అతను బట్టలేమీ తీసుకురావద్దనీ ఇంట్లో వాళ్ళకు డవుటొచ్చే అవకాశం ఉందనీ అన్నాడు (అంటే డబ్బులు మాత్రమే తీసుకు రమ్మని!)

ఇంటి వద్ద తనవీ, తన తల్లివీ, తన అక్క దాచుకున్న నగలూ అన్నిటినీ ఆమె (వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు) చిన్నగా తన బాగ్‌లో సర్దింది. సామాన్యంగా అలాంటి సందర్భంలో ఆడపిల్ల గుండెలు దబదబా కొట్టుకోవాలి. కాళ్ళు గడగడా వణికిపోవాలి. కానీ ఆమెలో అలాంటి టెన్షన్ ఏమీ కలగలేదు. ఏదో నూతనోత్సాహంలో, దెయ్యం పట్టిన దానిలా ఉత్తేజంతో చేసిందామె ఆ పనుల్ని. ఆమెకు అంత థ్రిల్లింగ్‌గా అనిపించిందది. అలా అనటం కంటే అతగాడి మీద ఆమెకు అంత విశ్వాసం కలిగింది అనంటే బాగుంటుంది.

అతడామెను స్టేషను బయట కలుసుకున్నాడు. అతనితోపాటు మరో నడి వయసు మనిషి కూడా ఉన్నాడు.

అతడిని తన బాబాయిగా చెప్పాడతను. తను ఆమె వెంటే వస్తే తర్వాత పోలీసు ఆరాలలో తెలిసిపోతుందనీ తమ ఇద్దరినీ వాళ్ళు తేలికగా ఆచూకీ తీయగలరనీ ఆమెను మాత్రం బాబాయి వెంట బొంబాయి రమ్మనీ తను అదే సమయంలో అక్కడికి చేరుకుంటాననీ సెలవిచ్చాడు.

తలూపిందామె. గంగిగోవులా ఆ బాబాయి వెంట నడిచింది.

ఇంక తరువాత చెప్పటానికేముంది, బొంబాయిలో ఆమె ఒక షేక్ వృద్ధుడికి అమ్మేయబడింది.

మొదటి పేరాలో చెప్పిన బ్రోకర్ ముండాకొడుకు వీటికన్నింటికీ మూలం. వాడిక్రింద ఇట్లాంటి యువకులు కొందరు పని చేస్తున్నారు. వాళ్ళను వాడు పెంచి పోషిస్తున్నాడు.

ఆ యువకుడు ఇప్పుడు మరో యువతి కోసం గాలం వేస్తూ ఎదురు చూస్తున్నాడు. పిచ్చి తల్లి ఎవతో పడుతుంది ఆ గాలానికి.

శోభారాజ్‌గానీ మరొకళ్ళు గానీ తమ తమ నేరకలాపానికి మనదేశాన్నే స్థావరంగా చేసుకోవటానికి కారణం ఇదే - పాలు త్రాగిన తల్లి రొమ్మని గుద్దే వాళ్ళు ఇక్కడ ఎక్కువమంది ఉంటారని తెలుసు కాబట్టి! సుఖలాలసత మీదా, ఈజీ మనీ పట్లా మనుషులలో ఉండే మోజు ఈ దేశంలో, ముఖ్యంగా బోడి నీతులు చెప్పేవాళ్ళలో ఎక్కువ -

ఓ "మంచి" నియంతను ఈ దేశం మీదకి వదలరా నాయనా - నా దేశాన్ని మరో ఆధునిక జపాన్‌లా తయారు చేయరా బాబూ......!!

****